ఆంధ్రజ్యోతి



1★

పెద్దపల్లి

జిల్లా వార్తలు

గురువారం 2 అక్టోబరు 2025

జయహో.. దుర్గాభవానీ..

నేడు విజయదశమి వేడుకలు



పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులుగా దేవి నవరాత్రులు పదవ రోజు విజయ దశమి కలిసి దసరా అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని కూడా పిలుస్తారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చిందని పలువురి వాదన. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతి దేవికి తరువాతి మూడు రోజులు లక్ష్మీదేవికి తర్వాత మూడు రోజులు సరస్వతీ దేవిని పూజిస్తారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఆలయాల్లో అమ్మ వారికి ఒక్కోరోజు ఒక్కో అలంకరణ చేస్తారు. పదవ రోజు దసరాపండుగ విజయదశమి నాడు జరుపుకుంటారు. తెలుగు

(మిగతా 4వ పేజీలో)

రికార్డు స్థాయిలో ప్రసవాలు

● కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆస్పత్రి వైద్య సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపెల్లి జిలా కేంద్రంలోని ఎం.సి.హెచ్ ఆసుపత్రిలో సెప్టెంబర్ నెలలో రికార్డు స్థాయిలో 250ప్రసవాలు జరిగాయని, దీనికి కృషిచేసిన అధికారులను ప్రత్యేకంగా జిల్లాకలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. గతంలో ఎన్నడు సాధించని విధంగా సెప్టెంబర్ నెల జిల్లాలోని అన్నిప్రభుత్వ ఆసుపత్రులలో కలుపుకొని 503ప్రసూతులు నిర్వహించారని కలెక్టర్ తెలిపారు. గత నెలలో కేవలం 130వరకు మాత్రమే డెలివరీలు అయ్యేవని ఒక్క సెప్టెంబరు నెలలో ఇంత పెద్దమొత్తంలో డెలివరీలు కావడంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత డాక్టర్లను, సిబ్బందిని క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

తల్లిని అవమానించాడనే ఆర్ఎంపీపై హత్యాయత్నం

4లో

- 9 నెలల పాటు విచారణ జరిపి ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు.. పరారీలో నిందితుడి తల్లి..

మౌలిక వసతులపై నజర్

- గ్రామ పంచాయతీల్లో మొదలైన సర్వే
- రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల తీరుపై సమాచార సేకరణ
- ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న కార్యదర్శులు

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మౌలిక వసతులపై ప్రభుత్వం కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తోంది. సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా పొందుపర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనిపై కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా సర్వే బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గతంలోనే పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల వివరాలను ప్రభుత్వానికి తెలియజేసినా కచ్చితమైన సమాచార సేకరణ కోసం ప్రభుత్వం మరోసారి సర్వే చేపడుతోంది. కార్యదర్శులు ప్రభుత్వం కోరిన సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పంచాయతీ పాలన కోసం తీసుకువచ్చిన పల్లె ప్రగతి యాప్‌లోనే కొత్త ఆప్షన్ ఇచ్చి అప్‌డేట్ చేశారు.

● కార్యదర్శులకు అవగాహన..

సర్వేపై జిల్లా పంచాయతీ అధికారి అన్ని జీపీల కార్యదర్శులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వివరాలసేకరణపై అవగాహన కల్పించారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివేదికల తయారీ గురించి వివరించారు. సర్వేకు నిర్దిష్టమైన గడువు విధించకపోయినా, సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. యాప్‌లో సమాచారం పొందుపరిచిన తర్వాత ఎంపీడీవోలు, డీపీవో ధ్రువీకరణ అనంతరం నివేదికలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌కు అందించనున్నారు. దీంతో గ్రామ పంచాయతీల ప్రస్తుత స్వరూపం, అందుబాటులో ఉన్న వసతులపై ప్రభుత్వానికి కచ్చితమైన అవగాహన రానుంది.


జగిత్యాల మండలం కండ్లపల్లిలో వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శి

● పంచాయతీల స్వరూపం తెలిసేలా..

భవిష్యత్తులో పంచాయతీలకు కల్పించాల్సిన వసతుల కోసం నిధుల కేటాయింపు, ఇతర అవసరాలకు సర్వే వివరాలు ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాల తీరు, రోడ్లు, మురుగునీటి కాలువల పరిస్థితి, డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, చెత్త సేకరణ కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రాలీల స్థితిగతులపై అంచనా ఉంటుంది. శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ, పాఠశాల భవనాలకు నిధుల కేటాయింపు, మరుగుదొడ్లు, ప్రహరీలు, తాగునీటి వసతి మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవచ్చు. అదనపు వీధిదీపాల రోడ్డు రవాణావ్యవస్థను, మెరుగుపర్చేందుకు అవకాశం కలుగుతుంది.

● సమాచార సేకరణ ప్రారంభం

జిల్లాలోని 20 మండలాల పరిధిలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే పంచాయతీల్లో మౌలిక వసతుల పక్కా సమాచారం కోసం సమాచార సేకరణ ప్రక్రియ మొదలైంది. పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు, వ్యవసాయ సంఘం పశువైద్య ఉప కేంద్రాలు, పాఠశాల భవనాలు, పల్లెప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, వీధిదీపాలు, కుళాయిలు, బోర్లు, డ్రైనేజీలు, లింకురోడ్లు, ఇంకుడు గుంతలు, ట్రాక్టర్ ట్రాలీలు, రైతువేదిక, గ్రామ మ్యాప్‌లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల సేకరణ కేంద్రాలు తదితర వసతులపై సర్వే చేపడుతున్నారు. పల్లె ప్రగతి యాప్‌లోనే జీపీ ఇన్‌ఫ్రాక్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ అనే కొత్త ఆప్షన్ ఇవ్వగా వివరాలు అందులో పొందుపరుస్తున్నారు. 23 రకాల సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేసేలా యాప్‌ను సిద్ధం చేశారు.

పకడ్బందీగా సర్వే

-మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పల్లెల్లో పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తుండగా ఎంపీ వోలు, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేస్తున్నారు. గ్రామంలోని వివరా లను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

డీఎస్పీగా ఉద్యోగం సాధించిన మహేశ్వరికి సీపీ సన్మానం


మహేశ్వరిని సన్మానిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

మానకొండూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి మహేశ్వరి గ్రూపు-1లో ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగం సాధించింది. బుధవారం కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలంను కమీషనర్ కార్యాలయంలో కలిసింది. ఈ సందర్భంగా మహేశ్వరిని సీపీ శాలువాతో సన్మానించి అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగాధర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌కు ఎంపికైనట్లు ఆర్ట్ టీచర్ రామానుజచారి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న తొమ్మిదవ తరగతి విద్యార్థులు శివ, కళ్యాణ్‌లు విజువల్ ఆర్ట్స్ 3డి విభాగంలో చేప ఆకృతికి మండల ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో 3డి విభాగంలో వినాయకుడి ప్రతిమ ఆకర్షనీయంగా తయారు చేయగా కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంశలు పొందారు. జిల్లాస్థాయిలో మొదటి విజేతగా ఎంపికై రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు అనిత కుమారి, ఆర్ట్ టీచర్ రామానుజచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళకు విషపు పురుగు కాటు

గంగాధర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో బుధవారం మహిళకు విషపు పురుగు కాటు వేసింది. లక్ష్మీదేవిపల్లికి చెందిన బుజ్జి(40) సాయంత్రం కోళ్లను గూట్లో వేసేందుకు వెళ్లింది. ఇంటి వాకిట్లోకి వచ్చిన విషపు పురుగు మహిళ కాలిపై కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు మహిళను గంగాధర ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా సిబ్బంది కరీంనగర్ వెళ్లాలని సూచించారు.

'శాతవాహన'లో చరిత్ర, టూరిజం డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలి


ఎస్‌యూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో చరిత్ర, టూరిజం డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు వీసీ ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వీసీని కలిసిన చరిత్ర పరిరక్షణ సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రాంగణంలో శాతవాహనుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వీసీ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం యూనివర్సిటీ ప్రాంగణంలో శాతావానుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి చరిత్ర, టూరిజం డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీ టూరిజం ప్రొఫెసర్ గుజ్జెటి తిరుపతి, చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి, వ్యవస్థాపకులు డాక్టర్ సందవేణి తిరుపతి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుందారపు సతీష్ పాల్గొన్నారు.

జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

చల్‌గల్‌లో ఏర్పాటుకు నిర్ణయం

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయాన్ని స్థాపించేందుకు ఆమోదం లభించింది. దేశ వ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాలను స్థాపించేందుకు నిర్ణయం తీసుకోగా అందులో జగిత్యాల జిల్లాలో సైతం కేంద్రీయ విద్యాలయం మంజూరు అయిందన్నారు.

తెలంగాణలో ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా నాలుగు కొత్తగా కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర క్యాబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం లో, ములుగు జిల్లా కేంద్రంలో, వనపర్తి జిల్లా నాగవరం శివారులో, జగిత్యాల రూరల్ మండలం చల్గల్‌లో విద్యాలయాలను స్థాపించనున్నారు. మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కేంద్రీయ విద్యాలయం కీలకం కానున్నట్లు కేంద్ర ప్రకటించింది.

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల రూరల్ మండలం చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఆమోదం ఇవ్వడం పట్ల ప్రధాని నరేంద్రమోదీతో పాటు కేంద్ర మంత్రి వర్గానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ కృతజ్ఞతలు ప్రకటిం చారు. అదేవిదంగా కేంద్రీయ విద్యాలయం మంజూరు పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, జగిత్యాల బీజేపీ నియోజకవర్గ నాయకు రాలు బోగ శ్రావణి ప్రవీణ్, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్ హర్షం వ్యక్తం చేశారు.

మొరాయించిన రైల్వేగేటు

ట్రాఫిక్‌లో నిలిచిపోయిన అంబులెన్స్‌లు

వారం వ్యవధిలో మూడు సార్లు

గంగాధర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై మంగపేట సమీపంలోని రైల్వేగేటు బుధవారం గంట పాటు మొరాయించింది. వేసిన గేటు ఎంతకు తెరుచుకోకపోవడంతో ప్రధాన రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జగిత్యాల నుంచి కరీంనగర్ వైద్యశాలకు రోగులను తరలిస్తున్న మూడు అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగపేట సమీపం లోని జగిత్యాల వైపు రైల్వేగేటు ఇప్పటికీ ఈ వారంలో మూడు మార్లు మొరాయిం చింది. అసలే పండగ సమయం కావడంతో రహదారి మూడు రోజులుగా పూర్తిగా రద్దీగా ఉంటుంది. దసరాకు హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని గేటు సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


గేటు వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

పండుగ పూట విషాదం

- విద్యుదాఘాతంతో ఆర్టిజన్ ఉద్యోగి మృతి
- ఏఈపై దాడి చేసిన మృతుడి బంధువులు


శంకర్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ముందు విషాదం చోటు చేసుకుంది. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి బోర్నపల్లిలోని 132/33 ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఆర్టిజన్ ఉద్యోగి బి శంకర్‌రెడ్డి (45) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి ఆర్టిజన్ గ్రేట్-2 కార్మికుడిగా సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వ హిస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఈ శ్రీరామ మూర్తి నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని మృతుడి బంధువులు అతనిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్ప త్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

ఏఈ నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని బంధువుల ఆరోపణ..

హుజూరాబాద్ సబ్ స్టేషన్లో ఏఈ శ్రీరామ మూర్తి నిర్లక్ష్యం వలనే శంకర్‌రెడ్డి మృతి చెందాడని మృతుడి బంధువు ఆరోపించారు. ఏఈ పై నుంచి ఎల్‌సీ తీసుకోకుండానే శంకర్‌రెడ్డిని మరమ్మతులు చేయాలని పంపించడంతో విద్యుదాఘాతంతో మృతి చెందాడని బంధువులు రోదించారు. నిర్లక్ష్యం వహించిన ఏఈపై చర్యలు తీసుకోవాలని ఆర్టిజన్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శంకర్‌రెడ్డిని ఆర్థికపరంగా ఆదుకోవాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ ఘటనపై ట్రాన్స్‌కో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు.


దాడిలో గాయపడ్డ ఏఈ శ్రీరామమూర్తి

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో సన్మానం

సుభాష్‌నగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో ఏవోలుగా పదోన్నతి పొందిన వారికి టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం కరీంనగర్‌లోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా ఏకతా, సంఘీబావమే విజయాలకు పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, ఒంటెల రవీందర్‌రెడ్డి, ఏవి రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రతిమ వైద్య కళాశాలలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

కరీంనగర్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని ప్రతిమ వైద్య కళాశాలలో బుధవారం వరల్డ్ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నెల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విబాగాదిపతి డాక్టర్ అరుణ కఠారి మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా క్లినికల్ ఎగ్జామినేషన్, మమోగ్రఫీకి సంబంధించిన పరీక్షలు ఈ నెల మొత్తం ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. మహిళలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం 39 గేట్లు పైకి ఎత్తి 2,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి మూడు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 62.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 2,59,397 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల దాడి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో బుధవారం మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తూర్పాటి శశి (17) అనే బాలుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే శశి మృతి చెందాడని అతడి బంధువులు వైద్యులపై దాడి చేశారు. మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తూర్పాటి శశి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శశి మృతి చెందాడని అతడి బంధువులు ఆసుపత్రి పర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు వైద్యులపై దాడి చేశారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

పుణ్యతిథి వేడుకలకు సాయిబాబా ఆలయం ముస్తాబు

కోరుట్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా మరుసటి రోజు నిర్వహించే పుణ్యతిథి వేడుకలకు కోరుట్ల షిరిడీ సాయిబాబా ఆలయం ముస్తాబవుతోంది. ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించే వేడుకలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా ఈ సంవత్సరం వేల సంఖ్యలో భక్తులు హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అక్టోబరు 3న ఉదయంఅన్నదాన మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పుణ్యతిథి రోజున ఉదయం 5 గంటల నుంచి కాగడ హారతి, 5:30 ఆలయ సంకీర్తన, 6:30 అభిషేకం, 8:30 పతాకారోహణ, గణపతిపూజ, 9:30 కళషాభిషేకం, 10:30 విశ్వకర్మ యజ్ఞం, 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 వరకు అన్నదానం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ జువ్వాడి కృష్ణారావు ఏర్పాట్లను పరిశీలించారు.

రాజరాజేశ్వరి రూపంలో అమ్మవారు

ఛండీ హోమం -పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి అడ్లూరి



ధర్మపురి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారలు రాజరాజేశ్వరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం యోగా, ఉగ్ర నారసింహ స్వామివారిని పొన్న చెట్టు సేవపై ఊరేగించి రాత్రి వేళలో ఆలయానికి తీసుక వచ్చారు. నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఛండీ హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారలకు ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి, తిమ్మాపూర్ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి క్షేత్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన దేవి నవరాత్రోత్సవాల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించి ఛండీ హోమం, పూర్ణాహంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కన్నుల పండువగా అమ్మవారి తెప్పోత్సవం


వేములవాడ రాజన్న ఆలయ ధర్మగుండంలో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, పాల్గొన్న భక్తులు

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారి తెప్పోత్సవం అత్యంత కన్నుల పండుగగా కొనసాగింది. రాజన్న ఆలయ ధర్మగుండంలో బుధవారం ఆది దంపతులు పడవపైన విహరిస్తుంటే భక్తులు ఓం నమఃశివాయ నామస్మరణలో మునిగి తేలారు. వేములవాడ రాజన్న ఆలయంలో చేపడుతున్న శ్రీదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా పది రోజులపాటు విశేషపూజలు అందుకున్న అమ్మవారు మంగళవాయిద్యాల మధ్య తెప్పోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. అమ్మవారి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు ఆలయ ధర్మగుండం వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ధర్మగుండం భక్తజన సంద్రంగా మారిపోయి కనిపించింది. తెప్పోత్సవం కార్యక్రమానికి ఈవో రమాదేవి హజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

కరీంనగర్ కమిషనరేట్‌లో దసరా వేడుకలు


ఆయుధపూజ చేస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో దసరా పండగ సందర్భంగా నిర్వహించిన ఆయుధ, జమ్మి, వాహన పూజ కార్యక్రమాల్లో పోలీసు కమిషనర్ గౌస్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(ఏఆర్) భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, జానీమియా, శ్రీధర్‌రెడ్డి, కిరణ్ కుమార్, పీఏలు శ్రీనివాస్, రాంచందర్‌రావు, సృజన్‌రెడ్డి, బిల్లా కోటేశ్వర్, సరిలాల్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామగిరి ఖిల్లాపై రోప్‌వే ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం: ఎంపీ

పెద్దపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రామగిరి ఖిల్లా పర్యాటకాభివృద్ధి కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోప్‌వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2.1కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణానికి రూ.2కోట్ల 46లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. ఈ రోప్‌వేతో కోట పాదాల నుంచి కొండ పైభాగానికి భక్తులు, పర్యాటకులు సులభంగా, సురక్షితంగా చేరుకోగలరని, అదనంగా రామగిరి పరిసరాల్లో పర్యాటక అభివృద్ధికి మరో రూ.2.50కోట్లు కేటాయించారని తెలిపారు. 'స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు, చిన్న వ్యాపారాలకు ఆదాయం వస్తుంది. రామగిరి అభివృద్ధి దిశగా ఇది ఒక కొత్త అధ్యాయం. రామగిరి ఖిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడమే గాకుండా ప్రముఖ పర్యాటకకేంద్రంగా వెలుగొంద నుంది.' అని ఎంపీ పేర్కొన్నారు.







ఖనిలో కిటకిటలాడిన మద్యం, మాంసం దుకాణాలు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ గాంధీజయంతి రోజున రావడంతో బుధవారం ఉదయం నుంచే గోదావరిఖనిలోని మద్యం, మాంసం దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. బంద్ కావడంతో ముందస్తుగానే బుధవారం సాయత్రంనుంచి మేకలు, కోళ్లను వధించారు. కోల్‌బెల్ట్‌లో దసరా పండుగ పెద్దఎత్తున నిర్వహిస్తారు. దీంతో మద్యం, మాంసం వ్యాపారం కోట్లలో జరుగుతుంది. ఈసారి గాంధీజయంతి రోజున పండుగరావడంతో చాలామంది వ్యాపారులు అందోళ నకు గురయ్యారు. కానీప్రజలు మాత్రం ముందస్తు గానే పండగ మొదలు పెట్టడంతో వ్యాపారాలు జోరు గా సాగాయి. కొత్తకూరగాయల మార్కెట్, ఊర్వశి థియేటర్, ఫైవింక్లయిన్, ఐబీకాలనీ, పవర్‌హౌస్‌కాలనీ, మార్కండేయకాలనీల్లో మాంసం దుకాణాలు, మద్యం షాపుల వద్ద జనం క్యూకట్టారు.

దుర్గామాతకు బీఆర్ఎస్ నాయకుల పూజలు

ఓదెల, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నేతలు దుర్గామాత మండపాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గంట రాములు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతీ, సంప్రదాయాలను అందరూ పాటించాల్సిందేనని, నిమజ్జనోత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కనికిరెడ్డి సతీష్, బోడకుంట నరేష్, రామకృష్ణ, పోశెట్టి, కొంద్ర రవి పాల్గొన్నారు.

● ఎస్ఐ సనత్‌కుమార్ ప్రత్యేకపూజలు

జూలపల్లి: దేవి నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మండలకేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపంలో బుధవారం జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్ భక్తులతో కలిసి ప్రత్యేకపూజలుచేసి మ్రొక్కులు తీర్చుకున్నాడు. ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటి మాజీ చైర్మెన్ పాటకుల అనిల్, సీతఈవో గీస సురేష్, గుండు కర్ణాకర్, నాగరాజు, నవీన్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌ని విజయవంతం చేయండి..

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 5న గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని సిరి ఫంక్షన్ హాల్ లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక ఐక్యవేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం కళ్యాణ్‌నగర్‌లోని ఒక ఫంక్షన్‌హాల్‌లో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ 15సంవత్సరాలుగా దసరా పండుగ సందర్భంగాతః కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అధ్యక్షుడు బండారి రాయమల్లు, ప్రధానకా ర్యదర్శి సబ్బు మల్లయ్య, సభ్యులు మొండయ్య, రెడ్డి భాస్కర్, వీరేశం, శ్రీనివాస్, రాజేశం పాల్గొన్నారు.

ఐక్యతతోనే ధర్మం పరిరక్షణ

● గోపాలచార్యులు

ఓదెల, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): నావారు అనే భావనతో హిందువులంతా ఐక్యంగా ఉంటేనే ధర్మం పరిరక్షింపబడుతుందని జ్యోతిష్య పండితుడు గోపాలచార్యులు అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి విజయదశమికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, బుధవారం మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలచార్యులు విజయదశమి,షమీ పూజ ఏ విధంగా వచ్చిందనేదానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రూప్1,2 ఉద్యోగులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1, 2 ఫలితాల్లో ఉద్యోగాలు పొందిన చిప్ప గణేష్, అర్ల సాగర్, అగుమామిడి అఖిల్ రెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరారు.

జిల్లా గ్రంథాలయానికి కంప్యూటర్ల బహూకరణ

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 జీ రీజియన్ 8 చైర్మన్ రేకుల పల్లి శశాంక పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో రెండు కంప్యూటర్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇంచార్జి గఫార్, లయన్స్ క్లబ్ సభ్యులు రేకులపల్లి సుష్మ, జోన్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.







క్యాంపు ఆఫీసు ఎదుట కార్మికుల నిరసన


● స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు ● వేతనాలు అందేలా చర్యలు

మంథని, ఆక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో, మాతాశిశుకేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో వేతనాల కోసం మంత్రి శ్రీధర్ బాబుక్యాంపు ఆఫీసు ఎదుట బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా ప్రభుత్వం తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో పండగపూట తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎర్కొంటున్నట్లుకార్మికులు వాపోయారు. వేతనాలకోసం అడిగితే కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమకు వెంటనే వేతనాలు మంజూరు చేసేలా చూడాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరుతూ పీఏ చంద్ర శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఏపీ చంద్రశేఖర్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి ఫోన్‌లో తీసుకెళ్లగా ఆయన డీసీహెచ్ఎస్‌తో మాట్లాడి వెంటనే కార్మికుల అకౌంట్స్ లో వేతనాలుపడే విధంగా చూడాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రా క్టర్‌పైచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో నేతలు బూడిద గణేష్, మంథని లింగయ్య, సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

































తల్లిని అవమానించాడనే
ఆర్ఎంపీపై హత్యాయత్నం

- 9నెలల పాటు విచారణ జరిపి ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు.. పరారీలో నిందితుడి తల్లి..

కోల్‌సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన ఆర్ఎంపీ యశ్వంత్‌పై హత్యాయత్నం కేసును ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ప్రధాన నిందితుడు కన్నం ఛత్రపతి(20), అతన్ని స్నేహితుడు నల్లగుల ప్రసాద్ అలియాస్ సన్నీ(20), రాంనగర్‌కు చెందిన కారు డ్రైవర్ అనవేని సాయితేజ అలియాస్ బచ్చలి చింటు(26)ను బుధ వారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రోసేనారెడ్డి పేర్కొ న్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఛత్రపతి తల్లి గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో నర్సుగా పనిచేసే కన్నం సంధ్య పరారీలో ఉంది. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు..

గోదావరిఖనికి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కన్నం సంధ్య కాంట్రాక్టు పద్దతిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. అదే ఆసుపత్రిలో మాడుగుల నాగరాజు, అతని భార్య దేవి పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. వీరు స్థానిక రామాలయం సమీపంలోని క్వార్టర్లలో నివాసముండే ఆర్ఎంపీ యశ్వంత్ నిర్వహించే డీఎన్ హోంకేర్ సర్వీస్‌లో కూడా పనిచేసేవారు. డీఎన్ హోంకేర్ సర్వీస్‌లో సేవలందిస్తే అదనంగా డబ్బులు వస్తాయని వారు కన్నం సంధ్యకు సూచించారు. దీనికి ఆమె అంగీకరించకపోగా సగం డబ్బులు హోంకేర్ సర్వీస్‌వారు తీసుకుంటారని, మిగతా సగం మాత్రమే పని చేసే వారికి ఇస్తారని పేర్కొన్నది. ఈవిషయాన్ని నాగరాజు యశ్వంత్‌కు చెప్పడంతో ఆయన రెండు మూడుసార్లు సంధ్యను అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా, వ్యక్తిత్వాన్ని కించపరిచాడు. ఈ విషయాన్ని ఆమె కుమారుడు ఛత్రపతికి చెప్పుకుని బాధపడింది. దీంతో అతడు యశ్వంత్‌పై పగ పెంచుకుని అతన్ని ఏదైనా చేయాలనుకున్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడైన సాయితేజ, ప్రసాద్‌కు చెప్పాడు. యశ్వంత్ కదలికలను అదేకాలనీలో నివాసముండే అనవేని సాయితేజ గమనించి ఛత్రపతికి చేరవేశాడు. ఈఏడాది జనవరి 7వ తేదిన ఛత్రపతి, అతని తల్లి సంధ్య, స్నేహితులు సాయితేజ, ప్రసాద్ యశ్వంత్ ఇంటివెనుక నుంచి లోపలికి చొరబడ్డారు. ఛత్రపతి యశ్వంత్‌పై కత్తితో దాడిచేసి నరికాడు. అనంతరం ఇంటి


అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

వెనుక వైపు నుంచి పారిపోయారు. అనుమానం రాకుండా ఛత్రపతి బెంగుళూరుకు వెళ్లి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాడు. సీసీ ఫుటేజీలో ఒక ముఖం మాత్రమే రికార్డు కావడంతో దాని ఆధారంగా పోలీసులు పరిశోధన ప్రారంభించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో క్రైమ్‌పార్టీ పోలీసులు నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఎట్టకేలకు ఛత్రపతిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయట పడింది. ఈ కేసు ఛేదించడంలో కృషిచేసిన క్రైమ్‌పార్టీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, సదానందం, శ్రీనివాస్, కానిస్టేబుళ్ల రమేష్, మధుకర్, శ్రీనివాస్‌ను సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు.

జయహో.. దుర్గాభవానీ..

(5వ పేజీ తరువాయి)

వారు దసరా పది రోజులు జరుపుకుంటారు. ముందు నవరాత్రులు దుర్గా పూజ ఉంటుంది. తెలంగాణలో ఈ తొమ్మిది రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడుతారు. తెలంగాణ పల్లెల్లో ప్రతి అమావాస్యకి స్త్రీలు పట్టుపీతాంబరాలు ధరించడం ఆనవాయితీ. విజయదశ మిరో జున చరిత్ర ప్రకారం రాముడు రావణుడిపై గెలిచిన సందర్భమే కాకా.. పాండవులు వనవాసం వెళ్తూ జమ్మిచెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భంగా రావణ వధ, జమ్మి ఆకుల పూజ చేయడం రివాజు. జగన్మాతగా దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసుడితో 9 రాత్రులు యుద్ధం చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భంగా 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండుగ చేసు కుంటున్నారు. అదే విజయదశమి, దేవీ పూజా ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో హెచ్చుగా ఉంటూ ఆర్ఎస్ఎస్ సంస్థాగత స్థాయిలో వారు అధికారికంగా జరుపుకునే ఆరు పండుగల్లో ఇది ఒకటి. దసరా రోజున పాలపిట్ట పక్షిని చూడటం వలన అదృష్టం, శ్రేయస్సు లభిస్తుందని నమ్ముతారు. దీనిని దైవిక ఆశీర్వాదంగా భావిస్తారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో దసరా ఏర్పాట్లు ముమ్మ రంగా కావించారు. ప్రధానంగా ఐటీఐ మైదానంతోపాటు మార్కెట్‌యార్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఉత్సవా లను నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు మాంసం విక్రయిస్తే లైసెన్స్ రద్దు

కోల్‌సిటీ, సెప్టెంబరు 1 (అక్టోబరు): గాంధీ జయంతి సందర్భంగా గురువారం ఎవరైనా మాంసం వ్యాపారులు మాంసం విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా జీవ హింస చేయకూ డదని ప్రభుత్వం ఆదేశించిందని, నగరపాలక సంస్థలో దుకాణాలు మూసి ఉంచాలని, ఎవరైనా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి


దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

కమాన్‌పూర్/మంథని, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): దుర్గామాత అమ్మవారి దీవెనలు, ఆశీస్సులు అందరిపై ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. బుధవారం దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని జూలపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాతలను ఆయన దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. మంథనిలోని హనుమాన్ నగర్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాతను బుధవారం పుట్ట మధు, శైలజ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, బీఆర్ఎస్ మహిళ మండల అధ్యక్షులు పొన్నం రాజేశ్వరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

కమాన్‌పూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాహిత సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 29 నిత్యావసర సరుకులను పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తనవంతుగా హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అమ్మ దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

అమ్మదయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మండలం లోని పలు దుర్గామాత మండపాలలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

పరామర్శ: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణగౌడ్ సతీమణి రంగు శ్యామలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించారు.

ఘనంగా కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రులు

- ఆలయాలు, మండపాల్లో మహాచండీయాగాలు
- దుర్గాదేవి ఆలయంలో పూజలు చేసిన ఐఏఎస్ నరహరి

మార్కండేయకాలనీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామికప్రాంతంలో దుర్గాదేవి శరన్నవరాత్రులు భక్తులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రులతో పారిశ్రామిక ప్రాంతంలో పండుగ వాతావరణ కొనసాగుతున్నది. చాలామంది అమ్మవారి మాలలు ధరించడంతో కోలాహలంగా మారింది. బుధవారం 10వ రోజు అమ్మ వారు మహిషసూరమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని దుర్గామాత ఆలయంలో అంబటి అర్చన, సంతోష్‌రావు దంపతులు చండీ యాగం నిర్వహించారు. ఇదే ఆలయంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ కార్యదర్శి, ఐఏఎస్ పరికి పండ్ల నరహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ నను ఆలయకమిటీ సన్మానించింది. జవహర్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంతోపాటు మండపాల్లో భక్తులు మహా చండీయాగాలు నిర్వహించారు. సాయంత్రం పలు మండపాల నుంచి ఉత్సవ విగ్రహాలకు శోభయాత్ర నిర్వహించారు.


మహాచండీ యాగం నిర్వహిస్తున్న సంతోష్‌రావు దంపతులు

బస్సుల కోసం ప్రయాణికుల పరుగులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు బస్సులు లేక వచ్చిన బస్సుల కోసం పరుగులు తీశారు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. మూడురోజులుగా హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌వంటి నగరాల నుంచి సొంతగ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేకబస్సులు నడిపించడంతో గ్రామాలకు వెళ్లే వివిధ రూట్లలో బస్సుల సంఖ్య తగ్గించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భూపాలపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫా బాద్, కాగజ్‌నగర్, బేగంపేట, ఓడెడ్, ధర్మారం, జగిత్యాల, రచ్చపల్లి, కూనారం, జమ్మికుంట వెళ్లేందుకు బస్సులు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. భూపాలపల్లి రూట్‌లలో నడిచే సర్వీసులను తగ్గించారు.సిటీలోని డిలాక్స్ మెట్రో బస్సులను కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాల, ఆసిఫాబాద్ ఏరియాలకు బస్సులను నడిపారు. ప్రస్తుతం పండుగ స్పెషల్‌పేరుతో ప్రయాణీకులపై అదనంగా 50శాతం చార్జిలనువసూలు చేస్తున్నారు.


బస్సుల కోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు

దుర్గామాత మండపాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కాల్వశ్రీరాంపూర్/పెద్దపల్లి రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే మండలంలోని పాండవుల గుట్ట సమీపంలోని జగత్ మహామునీశ్వరస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలంలోని ఆయాగ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవవిగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మార్కెట్‌చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, ఆయాగ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు..

సుల్తానాబాద్ : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆయన చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు రేడియం అప్రాన్లు, రేయిన్ కోట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయచైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్‌కమిటీచైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.


దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన కలెక్టర్

పెద్దపల్లి రూరల్/రామగిరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని పెద్ద బొంకూర్ మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, రామగిరిలోని జేఎన్టీయూ, మంథని ఇంజనీరింగ్ కళాశాల, గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్‌రూమ్‌లను అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, డీసీపీ కరుణాకర్‌తో కలిసి బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంథని, గోదావరిఖని నియోజకవర్గం సంబంధించి 7మండలాలకు స్థానికసంస్థల ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 23న, పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించి 6మండలాలకు పోలింగ్ అక్టోబర్ 27న జరుగుతుందని అన్నారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, తహసీల్దార్లు రాజయ్య, అధికారులున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు జయంతి

సుల్తానాబాద్/పెద్దపల్లిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల ప్రియతమ నేత పెద్దపల్లి మాజీఎమ్మెల్యే బిరుదు రాజమల్లు అందరి హృదయాల్లో చిర స్థాయిగా నిలిచి ఉన్నారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం బిరుదు రాజమల్లు 75వ జయంతి సందర్భంగా వారిని గుర్తుచేసుకుంటూ పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి వారి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో బిరుదు రాజమల్లు కుటుంబ సభ్యులు, కూతుర్లు, కుమారులు, జిల్లా గ్రంథాలయచైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్‌చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లిలో జరిగిన జయంతి వేడుకలో మాజీకౌన్సిలర్ ఉప్పు రాజు, మున్సిపల్ మాజీచైర్మన్, ఎల్ రాజయ్య, నుగిళ్ల మల్లయ్య, అమర్‌నాథ్, అమీర్ శెట్టి రామస్వామి, జడలసురేందర్, బండారీ రామ్మూర్తి, పాల్గొన్నారు.

జమ్మి ఏరాట్లను పరిశీలించిన అధికారులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరుగనున్న షమీ పూజ ఏర్పాట్లను గురువారం మున్సిపల్, రెవెన్యూపోలీసు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ సాయంత్రం జరిగే షమీ కార్యక్రమంలో పాల్గొనాలని ముందస్తుగా పట్టణ ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రోజుకు 2.25లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి: సీఎండీ

గోదావరిఖని, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఈ ఆర్థికసంవత్సరంలో నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి రోజుకు 2.25లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తి, రవాణా చేయాలని సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశించారు. రోజుకు 14 లక్షల క్యూబిక్‌మీటర్ల ఓవర్‌బర్డెన్‌ను తొలగించాలన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ అన్ని ఏరియాల జీఎంలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా కీలక ఖనిజాల అన్వేషణ రంగంలోనూ కంపెనీ అడుగు పెట్టిందని గుర్తుచేశారు. బొగ్గు బ్లాక్‌లు, ఇతర ఖనిజాల వేలంలోనూ పాల్గొనేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని పేర్కొన్నారు. సింగరేణి బహుముఖ విస్తరణకు వెళ్తున్న నేపథ్యంలో ఉద్యోగులందరికీ కంపెనీ ఆర్థిక స్థితిగతులు, విస్తరణ ప్రణాళికలపై పూర్తి అవగాహన ఉండా లన్నారు. ఇకపై ఏరియాల వారీగా కూడా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, హైదరాబాద్ నుంచి ఈడీ కోల్ మూమెంట్ బీ వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టీ శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

ఆర్జీ-3లో 70 శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో సెప్టెంబర్ మాసానికి 70శాతం బొగ్గుఉత్పత్తి సాధించినట్లు జీఎం సుధాకర్‌రావు బుధవారం వెల్లడించారు. మాసాంతపు నిర్దేశించిన ఉత్పత్తికి గాను 4.40లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3.10 లక్షల టన్నులు సాధించి 70 శాతంలో నిల్చిందన్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు నిర్దేశించిన మాసాంతపుఉత్పత్తి 1.60లక్షల టన్నులకు గాను 0.15లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందన్నారు.

ఆర్జీ-2 సెప్టెంబరు నెల ఉత్పత్తి 52శాతం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గడిచిన సెప్టెంబరు నెలలో ఆర్జీ-2ఏరియాలో 52శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. ఏరియాకు నిర్దేశించిన లక్ష్యం 8.30లక్షల టన్నులు కాగా 4.27లక్షల టన్నులబొగ్గు ఉత్పత్తి(52%)జరిగినట్టు జీఎం పేర్కొన్నారు. 8.30లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాలని లక్ష్యానికి 3.59లక్షల క్యూబిక్ మీటర్లు (92%) వెలికితీసినట్టు జీఎం వెంకటయ్య తెలిపారు.